నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
12 | శనివారం 25 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఓదార్చి.. అభయమిచ్చి

- ఆదిలాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ పర్యటన
- బాధిత కుటుంబాలను పరామర్శించిన చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సభ్యులు
- అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని హామీ • తెగించి కొట్లాడాలని పిలుపు
- జోగు రామన్న, అనిల్ జాదవ్ తలా రూ. లక్ష చొప్పున సాయం

పదేండ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చిన బీఆర్ఎస్.. మరోసారి సంక్షోభ స్థితిలోనున్న రైతన్న కోసం కదిలింది. అన్నదాతల బలవన్మరణాలు, సాగు సంక్షోభంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు జిల్లాల బాట పట్టింది. ఇటీవల అధినేత సూచన మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన అధ్యయన కమిటీ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి, రైతు కుటుంబాలకు భరోసానిచ్చింది. ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని అభయమిచ్చింది.

దేవరావ్ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న అధ్యయన కమిటీ సభ్యురాలు సత్యవతి రాథోడ్. చిత్రంలో సభ్యుడు బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్ పాలనలో మళ్లీ రైతు ఆత్మహత్యలు

ప్రజాపోరాటం తప్పదు

తప్పకుండా రైతులకు బాసటగా ఉంటం. అన్నదాతకు అండగా ఉంటూనే ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తం. ఎన్ని బెదిరింపులు చేసినా ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటం. ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేయాలి. లేనిపక్షంలో ప్రజాపోరాటం తప్పదు. ఇది చెప్పడానికే ఈ పర్యటనను చేపట్టినం.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అధ్యయన కమిటీ చైర్మన్

- సంక్షేమ ఫలాలు సమయానికి అందకే బలవన్మరణాలు
- కేసీఆర్ హయాంలోనే అన్నదాతలకు స్థిరమైన జీవితం
- రైతులెవ్వరూ ధైర్యాన్ని కోల్పోవద్దు
- హామీలు నెరవేర్చే దాకా సర్కారును నిలదీయాలి
- రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, సభ్యులు

బేల మండలం రేణిగూడలో దేవ్‌రావ్ జాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి. చిత్రంలో అధ్యయన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌లో కిసాన్‌చౌక్‌లో రైతు విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సభ్యులు

మంచిర్యాల, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు ఎలాంటి కష్టాలు రాలేదని, రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. దురదృష్ట వశాత్తు సర్కారు మారిన తర్వాత మళ్లీ రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయయని, 13 నెలల్లోనే ఊహించని విధంగా దాదాపు 400కు పైగా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తీవ్ర ఆవేదన చెందారు. రైతులు ఎవరూ ధైర్యాన్ని కోల్పోవద్దని, మాట నిలబెట్టుకోలేని సర్కారును నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని అన్ని జిల్లాల రైతాంగానికి బీఆర్ఎస్ తరుపున భరోసా ఉంటామని చెప్పారు. రైతు ఆత్మహత్యల నేపథ్యంలో బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సభ్యులు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో మొదటిసారి పర్యటించారు. నేరడిగొండ, బేల మండలాల్లో పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రాష్ట్రంలో ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని దశల వారీగా అద్భుతంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. సాగునీటికి, కరంట్‌కు ఇబ్బంది లేకుండా పెట్టుబడిని సమకూర్చి, పంటలు కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించారని చెప్పారు. కరెంట్ కష్టాలు వస్తాయని, రుణమాఫీ కాక రైతులు రోడ్లెక్కుతారని, ఆత్మహత్యలు చేసుకుంటారని ఎవరూ ఊహించలేదని చెప్పారు. ప్రశాంతంగా ఉన్న రైతులు కాంగ్రెస్ పాలనలో ఆందోళనతో కూడిన జీవితాన్ని గడపాల్సి దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. కరెంట్ వచ్చేది.. పెట్టుబడి వచ్చేది.. రుణమాఫీ అయ్యేది.. బోనస్ వచ్చేది.. పంట కొనుగోళ్లు చేపట్టేది.. ఇలా దేనికీ నమ్మకం లేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ఇలాంటి పరిస్థితి తీసుకొచ్చి రైతుల్లో ఉండే ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు సమయానికి అందకపోవడం వల్లే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మాట తప్పిందని, ఏ గ్రామానికి పోయినా రుణమాఫీ కాలేదని చెప్పే వారే ఎక్కువగా కనిపిస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లయితే రైతు జాదవ్ దేవరావ్ చనిపోయేవాడు కాదన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ, రైతు భరోసా అందక తీవ్ర ఇక్కట్లు పడుతూ అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థతతో విసుగెత్తిన రైతులకు భరోసా కల్పించి.. ధైర్యం నింపడమే అధ్యయన కమిటీ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పెద్దలు ఢిల్లీ, విదేశాలకు తిరిగే బదులు క్షేత్రస్థాయిలో రైతులను పట్టించుకోవాలన్నారు.

ఏ వర్గం సంతోషంగా లేదు

ఈ ప్రభుత్వానికి స్వయం నిర్దేశిత లక్ష్యం లేదు. ఎటువైపు పోవాలనే గమ్యం లేదు. ఏం చేయాలనే దిశానిర్దేశం లేదు. అందుకే ప్రభుత్వ హాస్టళ్లలో ఉండే పిల్లలు అనారోగ్యంతో చనిపోతున్నరు. మరోవైపు రైతులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసిన్రు. ఇలా ఏ వర్గం ప్రజలు కూడా ఈ రోజు తెలంగాణలో సంతోషంగా లేరు. ఈ ప్రభుత్వం నిజంగా ప్రజల మేలు కోసం చేసిందేమీ లేదు.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలో కంటతడి

కేసీఆర్ హయాంలో దేశంలో అనేక రాష్ట్రాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా.. తెలంగాణలో మాత్రం రైతు ఆత్మహత్యలు క్రమంగా తగ్గినయి. ఈ విషయాన్ని మోదీ సర్కారే పార్లమెంట్‌లో ప్రకటించింది. రైతులు బతకడానికి కేసీఆర్ దారి చూపించారు. కరెంట్.. నీళ్లు.. పెట్టుబడి సాయం ఇచ్చి, పంటలకు మార్కెట్ ధర, రైతు బీమా.. పింఛన్, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్టు ఇలా అన్నీ ఇచ్చి తెలంగాణలో ఉండే ఏ కుటుంబానికైనా చేయూత నందించే పరిస్థితిని కేసీఆర్ హయాంలో చూశాం. కానీ, ఈ రోజు రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో కంటతడి పెట్టని కుటుంబం లేదు.

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

రేణిగూడలో దేవ్‌రావ్ జాదవ్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

నేరడిగొండ తండాలో గజానంద్ కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



నేరడిగొండతండాలో మాట్లాడుతున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, చిత్రంలో అధ్యయన కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, కోటిరెడ్డి, యాదవరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్

గిరిబిడ్డల ఉసురు తగులుతది

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు సంతోషంగా ఉన్నరు. కేసీఆర్ కంటికిరెప్పలా కాపాడుకున్నరు. కానీ, కాంగ్రెస్ 13 నెలల పాలనలో రైతులు ఆగమవుతున్నరు. సకాలంలో రైతు భరోసా, రైతు రుణమాఫీ కాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజన బిడ్డల ఉసురు తగులుతది. రైతుల కోసం ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ₹2 లక్షలపైన రుణం ఉంటే ఇవ్వమని మోసం చేయడం సరికాదు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీకు బీఆర్ఎస్ అండగా ఉన్నది. మీ కోసం ప్రభుత్వంతో పోరాడుతుంది.

- సత్యవతి రాథోడ్, అధ్యయన కమిటీ సభ్యురాలు

ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

బీఆర్ఎస్ పాలనలో ఎవుసం పండుగలా సాగింది. రైతులు సంతోషంగా ఉన్నరు. తెలంగాణ ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మారింది. కానీ, కేసీఆర్ తెచ్చిన పథకాల కంటే రెండింతలు తెస్తామని చెప్పి అధికారంలో వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు రైతులను మోసం చేస్తున్నది. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైంది. ₹2 లక్షల రుణమాఫీ హామీని విస్మరించింది. ఇప్పటికే రెండు పంటలకు రైతు భరోసా సాయాన్ని ఎగ్గొట్టింది. పంటల కొనుగోళ్లలో సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులను సైతం మోసం చేస్తున్నది. రైతులు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఈ ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే. కనీసం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సైతం ప్రభుత్వానికి ధైర్యం రావడం లేదు. రైతులు పిట్టల్లా రాలిపోతున్నా స్పందన లేదు. ఇదేం ప్రభుత్వం? రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ తరుపున మేం ప్రభుత్వంతో పోరాడుతం. ఎవరూ అధైర్య పడొద్దు. మీకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. కేసీఆర్ జిల్లా వ్యాప్తంగా ₹2 లక్షల రుణమాఫీ కాని వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తం.

- జోగు రామన్న, అధ్యయన కమిటీ సభ్యుడు

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే

కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్లే రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. రైతుల బలవన్మరణాలు కలచివేస్తున్నయి. బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుంది. రైతులెవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ₹2 లక్షలు బ్యాంకులకు పోయి లోన్ తెచ్చుకోవాలని రైతులకు చెప్పి మోసం చేసిండు. రైతు భరోసా ₹15వేలు ఇస్తామని ₹12వేలే అంటున్నడు. రైతులెవరూ ధైర్యం కోల్పోవద్దు. మీకు మేమున్నం.

- రసమయి బాలకిషన్, అధ్యయన కమిటీ సభ్యుడు

రైతుల తరపున కొట్లాడుతం

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నరు. పదేళ్లలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, రుణమాఫీ, పంటల కొనుగోళ్లతో రైతులకు అండగా నిలిచిండు. కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యంకాని హామీలతో అధికారంలో వచ్చి రైతులు, పేదలను మోసం చేస్తున్నది. ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను సైతం అమలు చేయడం లేదు. కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. బోథ్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటం. ఆత్మహత్య చేసుకున్న రైతు ఆడే గజానంద్‌కు సొంత డబ్బులు ₹లక్ష సాయం అందిస్తున్న. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. త్వరలో రాష్ట్రానికి మంచి రోజులు వస్తయి. రైతులు ధైర్యంగా ఉండాలి. మీ తరపున అసెంబ్లీలో కొట్లాడుతం.

- అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

బేల : శంషాబాద్ గ్రామానికి చెందిన కౌలు రైతు భోడే గోవింద్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్న జోగు రామన్న

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ)/నేరడిగొండ/బేల : రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, కోటి రెడ్డి, యాదవరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో మొదటి సారి పర్యటించారు. కాంగ్రెస్ పాలనలో ఆగమై పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆత్మహత్యలకు గల కారణాలు, ప్రభుత్వం నుంచి అందిన సాయంపై ఆరా తీశారు. ముందుగా మధ్యాహ్నం ఒంటి గంటకు గుడిహత్నూర్ మండలం నేరడిగొండ తండాకు చేరుకొని, రైతు ఆడే గజానంద్ కుటుంబాన్ని పరామర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సొంతంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఆదిలాబాద్‌కు చేరుకొని, కిసాన్‌చౌక్‌లో రైతు విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి బేల మండలం రేణిగూడ చేరుకొని, ఇటీవల బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న జాదవ్ దేవ్‌రావు కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న సొంతంగా రూ.లక్ష అందజేశారు. ఆ తర్వాత ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయిలో మిర్చీ తోటను పరిశీలించి కౌలు రైతు ఈశ్వర్‌తో మాట్లాడారు. అనంతరం యాపల్‌గూడలో శనగ పంటను పరిశీలించి వ్యవసాయ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రైతులతో సమావేశమై, కాంగ్రెస్ ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో బేల మండలం మీర్జాపూర్‌లో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గోవింద్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయాచోట్ల రైతు కుటుంబాలు గోడు వెల్లబోసుకోగా, కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు భరోసానిచ్చారు. ప్రభుత్వ అసమర్థతతో విసుగెత్తిన రైతులకు భరోసా కల్పించి, వారిలో ధైర్యం నింపడమే అధ్యయన కమిటీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, మన బిడ్డలను బతికించుకోవాలని, మీకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని అభయమిచ్చారు. కొట్లాడాలే తప్ప.. వెనక్కి పోవద్దని, పోరాటానికి సిద్ధం కావాలని, సర్కారును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు.

బేల మండలం రేణిగూడలో రైతు జాదవ్ దేవ్‌రావ్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలో కూలీలతో మాట్లాడుతున్న సభ్యులు

గోడు వెల్లబోసుకున్న రైతులు

అధ్యయన కమిటీ సభ్యుల పర్యటనను జిల్లా రైతులు స్వాగతించారు. సభ్యులు జిల్లాకు వస్తున్నారన్న విషయం తెలుసుకొని పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యాపల్‌గూడలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం ఆగుతుందని తెలుసుకొని.. గుడిహత్నూర్, బేల పర్యటన పూర్తి చేసుకొని వచ్చే వరకూ ఎదురు చూశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి, యాపల్‌గూడలో పంటలను పరిశీలించి రైతులు, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయాచోట్ల అధ్యయన కమిటీ సభ్యులను కలిసి రైతులు కాంగ్రెస్ పాలనలో ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వంలో ఉన్న పరిస్థితులు.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కమిటీకి వివరించారు. ముఖ్యంగా రుణమాఫీ, రైతు భరోసా అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని, అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కంటతడి పెట్టారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సైతం ప్రభుత్వానికి ధైర్యం కావడం లేదని, రైతులు పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా సాగు చేసుకున్నామని, ఇప్పుడు తమ పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన చెందారు. తమ సమస్యల గురించి పట్టించుకునే వారు ఎవరూ లేరని, తమ మొర ఎవరికీ చెప్పాలో తెలియడం లేదని వాపోయారు. రైతులు సంతోషంగా ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయాచోట్ల కమిటీ వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బాని, సాజిద్ ఖాన్, ప్రమోద్ రెడ్డి, గంభీర్ తాత్రే, సతీశ్ పవర్, దేవన్న, తన్వీర్ ఖాన్, సంతోష్, షేక్ మహమ్మద్, రాథోడ్ రోహిదాస్, దత్తు, సురేశ్, బట్టు సతీశ్, ప్రమోద్ రెడ్డి, గంభీర్ టాత్రీ, సతీశ్ పవర్, దేవన్న, విపిన్ ఖోడ్ వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో గందరగోళం

నిరసనలు.. నిలదీతలతోనే మొదలు

- అర్హులకు న్యాయం చేయాలంటూ డిమాండ్‌లు
- ప్రజలకు సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న అధికారులు
- స్థానిక ఎన్నికల ముంగిట కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత

డే-4

గోలేటి గ్రామసభలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ దహెగాం/ చింతలమానేపల్లి/రెబ్బెన/వాంకిడి/తిర్యాణి/కెరమెరి/కౌటాల, జనవరి 24 : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను ప్రకటించే గ్రామ సభలు గందరగోళంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా నిరసనలు, నిలదీతలతోనే ప్రారంభమవుతున్నాయి. స్థానిక సంస్థలు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరుగుతున్నది. దహెగాం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో రచ్చ జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల జాబితా చదువుతుండగా, ఒక్కసారిగా ప్రజలు తమకు ఇండ్లు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కావాలంటూ వేదిక ముందు బైఠాయించారు. అలాగే చింతలమానేపల్లిలో జాబితాల్లో అర్హులైన పేర్లు రాలేదని స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడెంలో ఇందిరమ్మ కమిటీ ఎంపికలో అవకతవకలు జరిగాయని, ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. పథకాల జాబితా చదివి వినిపించగా, అనర్హులు, సంపన్నులకు ప్రాధాన్యమిచ్చారని, అర్హులైన తమకు ఇవ్వలేదంటూ స్థానికులు అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ, ఏఐటీయూసీ నాయకులు వేదిక ముందు బైఠాయించి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అజ్మీర బాబురావు, మాజీ ఎంపీటీసీ కడతల మల్లయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు అక్కేవార్ దయాకర్ మాట్లాడుతూ అర్హులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వాలని కోరగా, డీపీవో భిక్షపతి స్పందిస్తూ మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ బైఠాయించి నిరసన తెలిపారు. నాయకులు పరికిపండ్ల సత్యనారాయణ, సిడాం రాజేశ్వర్, పంబాల శ్రీనివాస్, వేయిగండ్ల క్రిష్ణ, ఆసీఫ్ అలీ, పర్వతి అశోక్, రవీందర్‌గౌడ్ ఉన్నారు. వాంకిడి మండలం ఖిరిడీలో లబ్ధిదారులు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయలేదని, ఎన్ని సార్లు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులను నిలదీశారు. కలెక్టర్ రావాలి, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రోడ్డు పై బైఠాయించి ధర్నా చేపట్టారు. తిర్యాణి మండల కేంద్రంలో జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో ప్రజలు నిలదీశారు. తప్పులు సరిచేసి తుది జాబితా విడుదల చేస్తామని డీటీడీవో, మండలప్రత్యేక అధికారి రమాదేవి నచ్చజెప్పడంతో వారు శాంతించారు. ఎస్ఐ శ్రీకాంత్, ఈజీఎస్ ఏపీవో శాకీర్ ఉస్మానీ, ఏఈవో వినోద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు. కెరమెరిలో జాబితాలో అర్హుల పేర్లు రాలేదంటూ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో అహ్మద్ అమ్జద్‌పాషా పాల్గొన్నారు. కౌటాలలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పార్టీ గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గ్రామ కార్యదర్శి అంజలి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామసభ నిర్వహించారని మండిపడ్డారు. కార్యదర్శిపై చర్యలు తీసుకొని, మళ్లీ గ్రామ సభ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

దహెగాం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు